క్లుప్తంగా

రేపు 'చలో వరంగల్'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించనున్న చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌మాదిగ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పద్మశ్రీ పురస్కారం అందుకుని తొలిసారి రాష్ట్రంలోకి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు శ్రీరాములు, విజయ్‌కుమార్, విజయ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పెంచాలని వినతి



ఇంచార్జి మేనేజర్ వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హయత్‌నగర్: గండిచెరువు గ్రామానికి బస్సు సర్వీసులు పెంచాలని కోరుతూ గ్రామస్తులు సీపీఎం నాయకులతో కలిసి గురువారం హయత్‌నగర్–1 బస్‌డిపో ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 గంటల తర్వాత సాయంత్రం 5 గంటల వరకు తమ గ్రామానికి బస్సులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, శ్రీరామ్మూర్తి, మల్యాద్రి, భాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, అనిత, రాణి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత



కానిస్టేబుల్‌కు సీసీ కెమెరాలు అందజేస్తున్న గోపాల్

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి గురువారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొప్పిడి గోపాల్ సీసీ కెమెరాలు అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌ను కానిస్టేబుల్ మహేశ్ తదితరులు అభినందించారు.

పేదలకు అండగా కాంగ్రెస్

పార్టీ నాయకుడు మహేందర్‌జీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

మంచాల: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండేటికార్ మహేందర్‌జీ అన్నారు. మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన దోసపాటి రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రూ.62,500 చెక్కు మంజూరైంది. ఈ మేరకు గురువారం మహేందర్‌జీ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మోతిరాం నాయక్, మిద్దె శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రావు, నాయకులు రాంచందర్, జంగయ్య, సత్యనారాయణ, శివ శంకర్, నర్సింహ, మారయ్య, బాలు, నవీన్, వెంకటేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

మొయినాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి అన్నారు. చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు తరచూ రక్తం అవసరమని, అందుకోసం కళాశాల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించి ప్రతీ సంవత్సరం 250 యూనిట్ల రక్తాన్ని అందిస్తున్నామన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ సందర్భంగా 75 మంది రక్తదానం చేశారు.

'ఉపాధి' అక్రమాలకు చెక్

- నేటి నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్
- 2024–25లో చేపట్టిన పనులపై ఆరా
- ఇప్పటికే రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు



రాయపోల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024–25 గాను చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి చేపట్టే ఈ సోషల్‌ఆడిట్‌లో కూలీలు ఎంత పని.. ఎక్కడ చేశారు.. కల్పించిన పనిదినాలు ఎన్ని అనేవిషయాలపై ఇంటింటికీ వెళ్లి లోతుగా విచారణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిధులు సక్రమంగా వినియోగించారా.? పక్కదారి పట్టించారా అనే కోణంలోనూ సామాజిక తనిఖీ బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఇప్పటికే మంచాల, యాచారం మండలాల్లో సోషల్‌ఆడిట్ పూర్తయింది. పనుల పరిశీలన ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 14 పంచాయతీలుండగా 13,086 మంది కూలీలకు 7,267 జాబ్‌కార్డులు ఇచ్చారు. వీటిలో 5,230 కార్డులు యాక్టీవ్‌లో ఉండగా 7,636 మంది కూలీలు పనిచేస్తున్నారు. 254 మెటీరియల్, కూలీలు చేసిన పనులున్నాయి. కూలీలు చెరువుల పూడిక తీత, ఫాంపాండ్, ఇంకుడు గుంతలు, చెట్ల పాదులు తొలగించడం, పండ్ల తోటలు పెంపకం తదితర పనులు చేపట్టారు. పౌల్ట్రీ షెడ్డులు, పశువుల పాకలు, కల్లాల నిర్మాణం పనులు సైతం ఇందులోనే చేపట్టారు. ఈ పనులకుగాను గతేడాది రూ.2,59,04,394 కోట్లు ఖర్చు చేయగా పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.1.05లక్షలలు ఖర్చు చేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.66 లక్షలు వెచ్చించారు.

రికార్డుల స్వాధీనం

సామాజిక తనిఖీ అధికారులు ఇబ్రహీంపట్నం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయానికి చేరుకొని ఎంబీ రికార్డులు, మస్టర్ రోల్స్‌తో పాటు వివిధ రకాల రికార్డులను వారం క్రితమే స్వాధీనం చేసుకున్నారు. 20 మంది సామాజిక తనిఖీ బృందాలలో ఎస్ఆర్‌పీ, ఏడుగురు డీఆర్‌పీలు, వీఏస్‌ఏలు వచ్చారు.

గ్రామాలకు చేరుకున్న బృందాలు

ఉపాధి పనుల నిజనిర్ధారణకు ఉపాధి హామీ బృందాలు గురువారం చేరుకున్నాయి. ప్రతీ ఎంబీ, మస్టర్ రోల్, పేస్లిప్పులు, పట్టుకొని పని చేసినప్పుడు మీకు డబ్బులు వచ్చాయా.. లేదా? పనులు చేపట్టారా లేదా అనే కోణంలో విచారణ చేయనున్నారు. పనులు చేసిన ప్రదేశంలోకి వెళ్లి పరిశీలిస్తారు. త్వరలోనే గ్రామసభల తేదీలను ప్రకటించనున్నారు. గ్రామాల వారీగా బహిరంగ సభలు ఏర్పాటు చేసి విచారణ చేపడతారు.

పెండింగ్‌లో కూలీల డబ్బులు

ఇబ్రహీంపట్నం మండలంలో ఇప్పటి వరకు పని చేసిన కూలీలకు ఆరు వారాల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే కలెక్టర్ మొదలు ఎంపీడీఓల వరకు కూలీల డబ్బులు చెల్లించాలని ఫిర్యాదులు చేశారు. కూలీలతో పాటు ఇతర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సైతం కూలీల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

అందరూ సహకరించాలి



సామాజిక తనిఖీ అధికారులకు కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారు. అధికారులు పారదర్శకంగా విచారణ నిర్వహించాలి. ఎవ్వరూ ఇబ్బందులు పడాల్సిన పని లేదు. సామాజిక తనిఖీ అధికారులకు క్షేత్ర సహాయకులు సైతం సహకరించాలి.

– తిరుపతాచారి, ఏపీఓ, ఇబ్రహీంపట్నం

టీజేఎఫ్ సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీయూడబ్ల్యూజే నేతలు

ఇబ్రహీంపట్నం: నగరంలో నిర్వహించనున్న టీజేఎఫ్ సభను విజయవంతం చేయాలని టీయూడబ్లూజే (హెచ్–143)సంఘం జిల్లా నాయకుడు చెరుకూరి మహేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం కమిటీ సంఘం ఆధ్వర్యంలో సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఏర్పడి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతన టీయూడబ్లూజే (హెచ్–143)గా ఆవిర్భవించిందన్నారు. టీజేఎఫ్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31న (శనివారం) నగరంలోని జలవిహార్‌లో నిర్వహించనున్న సభకు జర్నలిస్టులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతోపాటు జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ఈ ఫోరం అహర్నిశలు కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చెరుకూరి రాజు, పి.వెంకటేశ్, పి.క్రాంతి, ఎస్.బాబు, సీహెచ్.కృష్ణయాదవ్, ఆర్.సంతోష్, నరేందర్, ఎం.శ్రీనివాస్, యాదగిరి, బి.దశరథ, మహేశ్‌చారి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో నిర్వహించనున్న పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశ ఏర్పాట్లను గురువారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పార్టీశ్రేణులు సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్పతినాయక్, బాలరాజు, జహంగీర్‌అలీ తదితరులు ఉన్నారు.

ఎరువుల వాడకం తగ్గించండి

ఆమనగల్లు: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే సాగు చేపట్టాలని.. అందుకు తగు మోతాదులోనే రసాయన ఎరువులు వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవీలత, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రశాంతి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రాంనుంతలలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు పచ్చిరొట్టల సాగు, పంట మార్పిడి, పంట వైవిధ్యం తదితర చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కావ్య, రైతులు పంతునాయక్, యాదయ్య, సత్తయ్య, శ్రీనివాస్, సరిత, డోలి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

మాడ్గుల: సేంద్రియ పద్ధతుల్లో సాగు చేపడితే భూసారం దెబ్బతినకుండా అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ మురళి అన్నారు. గురువారం మండల పరిధిలోని సుద్ధపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. పంట మార్పిడితో సాగు ఖర్చు తగ్గుతుంనది చెప్పారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రశీదులు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అరుణకుమారి, విస్తరణ అధికారులు జోత్స్న, భార్గవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్



మాడ్గుల: మాట్లాడుతున్న డాక్టర్ మురళి



ఆమనగల్లు: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మంచాల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ జయమ్మ

సొంతింటి కల సాకారం చేసేందుకు..

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా కేటాయింపు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 14వ వార్డులో రాంనుంతలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట పేదలను మోసం చేసిందని ఆరోపించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, మాజీ ఎంపీపీ అనిత, పార్టీ నాయకులు మల్లయ్య, మహేశ్, అలీం, ఖాదర్, కరీం, మెకానిక్ బాబా, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, లబ్ధిదారుడు కామల్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆశీశ్‌రెడ్డి, నాయకులు శంకర్, భిక్షపతి, రామస్వామి, మల్లేశ్, జంగయ్య, శ్రీను, కృష్ణయ్య, యాదయ్య, శేఖర్, వెంకటేశ్, సుధాకర్, రమేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంచాల: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు గుండమోని జయమ్మ అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని ఎల్లమ్మ తండాలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అన్నారు. దశలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇండ్లు రాగా మళ్లీ పదేళ్ల తర్వాత రేవంత్‌రెడ్డి అందజేస్తున్నారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఓట్లు దండుకుందని ఆరోపించారు. ఎల్లమ్మతండాలో 16 మందికి ఇళ్లు మంజూరవగా.. ఎనిమిది మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మల్లేశ్, పద్మ, పంచాయతీ కార్యదర్శి ఫరాన్, నాయకులు శ్రీధర్, పాండు, తానేశ్, రాజు, శంకర్, పద్మ, జ్యోతి, శిరీష, శాంత, బాలమణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే నిర్మాణాలు

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఏడుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కాగా గురువారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎండీ ఘని, లింగారెడ్డి, పోచమ్మ, పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి వేణు ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. దసరాలోగా నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల సూచనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టాలని.. లేని పక్షంలో బిల్లులు నిలిచిపోతాయని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తెలిపారు.

సర్కారు బడులను కాపాడుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ వైఖరితో నిర్వీర్యమవుతున్న సర్కారు బడులను ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాత గురువారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సమాన విద్య, వైద్యం అందాలంటే ఆ రెండు వ్యవస్థలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వాలను ప్రశ్నించాలని సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

- ఫలితాల ఆధారంగా అనువైన పంటల సాగు చేపట్టాలి
- ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత

యాచారం: భూసార పరీక్షల ఆధారంగానే పంటలు సాగు చేస్తే మంచి దిగుబడితో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో గురువారం కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూసార పరీక్షలపై రైతులను చైతన్యం చేయాలన్నారు. కూలీల ఖర్చు లేకుండా యంత్రాల ద్వారా సులభంగా పనులు చేసుకునేలా ఆలోచనలు చేయాలని సూచించారు. ఆధునిక పద్ధతుల్లో సాగు చేపడితే మంచి లాభాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నాగార్జున, శ్రీ కృష్ణ, విజయ్‌కుమార్, సుధీర్, కీర్తి తదితరులు మాట్లాడుతూ.. సహజ వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, మట్టికి ఆరోగ్య పరీక్షలు ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, వ్యవసాయ డ్రోన్ల వాడకం, డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్, రైతులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కారం

మంచాల: వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా రైతాంగ సమస్యలు పరిష్కారం అవుతాయని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిత్తాపూర్, చాంద్‌ఖాన్ గూడ, ఆస్మత్‌పూర్ గ్రామాల్లో వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం పంటలకు సంబంధించిన తాజా సాంకేతిక పరిజ్ఞానాల గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. సేంద్రియ సాగు పద్ధతులను ప్రోత్సహించడం, నేల ఆరోగ్య కార్డుల ఆధారంగా పంటల సాగుకు మార్గనిర్దేశం చేస్తామన్నారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఏఓ కృష్ణ మోహన్, వ్యవసాయ శాస్త్రవేత్తలు నాగార్జున కుమార్, భార్గవి, గౌరవ్, సుధీర్, విజయ్‌కుమార్, శ్రీకృష్ణ, గౌతమ్, వి.చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: చౌదర్‌పల్లిలో డ్రిప్ పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుజాత, శాస్త్రవేత్తలు



మంచాల: చిత్తాపూర్‌లో..

ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇవ్వాలని ఆ సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్రామిరెడ్డి కోరారు. గురువారం సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల పోరాట ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, తాము అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలో అమరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటుగా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, బాలు నాయక్, జాంగారి రవి, రవికుమార్‌గౌడ్, జాంగారి నర్సింలు, అడ్డెట్ల రాజు, మేకల వెంకటేశ్, సుధాకర్, వాహెద్, విఠల్, రావుఫ్, శివకుమార్, శివరాములు, మహేందర్, ప్రసాద్, సురేష్, మల్లేశ్, సాయిలు, శ్రీనివాసులు, ఎల్లోజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్ రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని జీడివడకతండా, శేరిగూడ, నేర్లచెరువుతండా, తిమ్మాజిపల్లితండా, చిన్నచిల్కమర్రి గ్రామాల్లో ఎంఈఓ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. అనంతరం ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింలు, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, పతంజలి, సత్యం, సురేష్‌గౌడ్, మేఘాబాయి, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386